# రాసినరాత

**ఒ**కడు చిన్నవాడు, కవి, మంచివాడు, బీదవాడు. రెండోవాడు అందగాడు, పెద్ద ఉద్యోగి, తెలివిగలవాడు, సంపన్నుడు.

ఈ ఇద్దర్లోనూ ఎవరో ఒకరు తన భర్త కావాలి. ఆమె తన అంతరాత్మలో రెండో వాణ్నే స్థిరం చేసుకున్నది. కాని ఆ అంతరాత్మ ఏ అజ్ఞాతకారణం చేతనో ఆమె చేత ఆ విషయం వెంటనే బయట పెట్టించలేదు. పై కామె ఇద్దరితోనూ సమంగానే ప్రవర్తిస్తున్నది. ఆమె తండ్రి కూడా రెండోవాణ్నే తన అల్లుడుగా ఎన్నుకున్నాడు; కాని కుమార్తె అభిప్రాయం బయట పెట్టందీ తన అభిప్రాయం ఆయన బయటపెట్టదలచలేదు.

ఇంతలో ఒక దైవజ్ఞుడొచ్చాడు. తలవని తలంపుగా. అమ్మాయి జాతకం చూశాడు.

"ఈ పిల్లకు త్వరలోనే వివాహం జరగబోతున్నది" అన్నాడు దైవజ్ఞుడమోఘంగా. అందగాడు, పెద్ద ఉద్యోగి, తెలివిగలవాడూ, ధనికుడూ అయిన భర్తను చేపట్టుతుంది."

"దైవజ్ఞులు చెప్పింది నిజమేనా, నాన్నా?" అన్నదమ్మాయి.

"నాకుమటుకు నాకు సందేహం లేదమ్మా!" అన్నాడు తండ్రి.

"అయితే నేను కవిగార్ని చేసుకుంటాను నాన్న. నాకు కావలసిన లక్షణాలన్నీ ఉన్న భర్త రాసి పెట్టి ఉన్నప్పుడు నాకిష్టమైన వాణ్నెందుకు చేసుకోకూడదూ? నాక్కావలసిన లక్షణాలు రెండో ఆయనలో ఉన్నప్పటికీ, నాకు నచ్చినవాడు కవిగారే!"

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***
***యువ కార్యాలయం, తెనాలి***